క్లుప్తంగా

లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి



బోధన్: శ్రావణ మాస శనివారం అమావాస్యను పురస్కరించుకుని ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ శివారులో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి దైవ దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అష్టకొనేరులో భక్తులు స్నానమాచరించారు. ఆలయప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. దేవాదయశాఖ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు రాకుండా సౌకర్యాలు కల్పించారు.

వరి పంట పరిశీలన



నవీపేట: మండలంలోని కోస్లీ శివారులోని వరి పంటను ఏవో నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పరిశీలించారు. వాతావరణంలో కలిగిన మార్పులతో వరి పంటకు ఎండాకు తెగులు, పురుగులు సోకినట్లు నిర్ధారించారు. పంటను పెరుగకుండా నాశనం చేసే తెగులు, పురుగుల నివారణకు వాడే మందులను రైతులకు వివరించారు. ఏఈవో వినోద్, రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న సోయా పంట..

బోధన్: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామ శివారులో భారీ వర్షాలకు దెబ్బతిన సోయా పంటను తహసీల్దార్ శశిభూషణ్, ఏవో శ్వేత పర్యటించి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నీట మునిగి సోయా పంటకు పూర్తి నష్టం వాటిల్లిందని రైతులు అధికారులకు తెలిపారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు అనిల్, రమేష్ తదితరులున్నారు.

ఈజీఎస్ సోషల్ ఆడిట్‌పై గ్రామ సభలు



బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ కింద చేపట్టిన పనులపై వీఎస్ఏలు చేపట్టిన ఆడిట్ వివరాల కోసం శనివారం గ్రామ సభలను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనుల వివరాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. పనుల్లో , మస్టర్లతో ఏదైనా తేడా ఉంటే దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముప్కాల్ మండల కేంద్రంలో..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ఆదివారం ఈజీఎస్ సామాజిక తనిఖీ 4వ విడత ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాల గంగాధర్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో గత నాలుగు రోజులుగా చేసిన సోషల్ ఆడిట్‌కు సంబంధించిన వివరాలను ప్రజావేదికలో చదివి వినిపించడం జరుగుతుందన్నారు.

ఆయిల్ పాం సబ్సిడీని వినియోగించుకోవాలి



బాల్కొండ: ఆయిల్ పాం సాగు కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలని బాల్కొండ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి రుద్ర వినాయక్ అన్నారు. మెండోరా మండలం వెల్కటూర్‌లో రైతులకు శనివారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి వసంత్, ప్రీయూనిక్ ఆయిల్ పాం కంపెనీ ప్రతినిధులు సాయికిరణ్, రాజెందర్, , ఏఈవో రాజేశ్వర్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీపీలకు నిధులు కేటాయించాలి



నందిపేట్(ఆర్మూర్): గ్రామాలలో సమస్యలు పరిష్కరించేందుకు జీపీలకు నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా నాయకులు ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. నిధుల లేమితో జీపీల్లో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయన్నారు.పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. నాయకులు రాజలింగం, కె. గంగాదర్, కూశన్న, దేవన్న తదితరులున్నారు.

ఆగని పేకాట..!

- డొంకేశ్వర్ మండలంలో మళ్లీ వెలిసిన అడ్డాలు
- పలు గ్రామాల్లో పేకాటరాయుళ్లకు ప్రత్యేక వసతులు
- పోలీసుల నిఘా మరింత పెంచాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): పేకాటలో పట్టుబడుతున్న వ్యక్తులు తీరు మార్చుకోవడం లేదు. పత్తాలాటను వదల్లేక మళ్లీ ఆడటం మొదలు పెట్టారు. డొంకేశ్వర్ మండలంలో పేకాట అడ్డాలు మరోసారి బయటపడ్డాయి. మూడు రోజుల కిందట నూత్‌పల్లిలో పోలీసులు పేకాట అడ్డాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. మొత్తం తొమ్మిది మందిని పట్టుకుని రూ.39,100 నగదుతో పాటు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో మరో అడ్డాలో పెద్ద గ్యాంగ్ కూడా పేకాట ఆడుతున్నారు. పోలీసులు దాడులు చేస్తున్న విషయం తెలుసుకుని పరారయ్యారు. అక్కడ కూడా దాడులు చేసి ఉంటే దాదాపు 25మంది దొరికేవారు. పెద్ద తలకాయలు బయటపడేవని ప్రచారం జరిగింది. పరారైన గ్యాంగ్‌లో కొంతమంది గతంలో పోలీసులకు పట్టుబడిన వారున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దాడులకు వెరవని పేకాట రాయుళ్లు అడ్డాలు మార్చి మరీ పేకాట ఆడుతున్నారు.

మండలంలో పోలీస్ స్టేషన్ లేక...

కొత్త మండలంగా డొంకేశ్వర్ ఏర్పడి మూడేళ్లు దాటినా ఇప్పటివరకు పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాలేదు. నందిపేట్ పోలీసులే మానిటరింగ్ చేస్తున్నారు. డొంకేశ్వర్ మండలంపై పోలీసులు నిఘా కరువైంది. కనీసం వాహన తనిఖీలు, డంకన్ డ్రైవ్ పరీక్షలు కూడా చేయని పరిస్థితి ఉంది. దీంతో మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పేకాట నిత్య కృత్యంగా కొనసాగుతోంది.

ఆడే చోట సకల సౌకర్యాలు..

మండలకేంద్రంతో పాటు చుట్టూ పక్కలా గ్రామాల్లో పేకాటకు అడ్డాలు ఉన్నాయి. ఎక్కువగా గ్రామ శివారు ప్రాంతాలు, నిర్మానుష్య స్థలాలు, తోటలు, పాడుబడిన ఇళ్లను కేంద్రాలుగా చేసుకుంటున్నారు. ఈ అడ్డాలను నిర్వహించడానికి ప్రత్యేకంగా వ్యక్తులు ఉంటున్నారు. వీరు పేకాట రాయుళ్లకు సకల సౌకర్యాలు కల్పిస్తారు. పేక ముక్కలతో మొదలుకుని మద్యం, భోజనాలు అడ్డాల వద్దకే తెప్పిస్తారు. భోజనాలు, మద్యం సరఫరా చేసే వ్యక్తులు కూడా ఈ మధ్య డొంకేశ్వర్‌లో పెరిగిపోయారు. పేకాట స్థావరాలకు పోలీసులు, ఇతర ఏ వ్యక్తులు రాకుండా ఒక వ్యక్తికి పూర్తి బాధ్యతలిచ్చి డబ్బులు ముట్టజెప్తారనే ఆరోపణలున్నాయి. దీంతో ఈదందా జోరుగా సాగుతోంది.

నిఘా పెంచుతాం

పేకాట జరుగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. డొంకేశ్వర్ మండలంలో ఇక నుంచి పెట్రోలింగ్ కూడా చేస్తాం. పేకాట ఆడేవారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. గతంలో పట్టుబడిన వ్యక్తులు మళ్లీ దొరికితే తీవ్రంగా పరిగణించి కేసులు నమోదు చేస్తాం.

– శ్యామ్‌రాజ్, ఎస్సై, నందిపేట

పింఛన్ పెంచకపోతే రాజీనామా చేయాలి

- ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ
- బోధన్‌లో డివిజన్ స్థాయి దివ్యాంగుల మహాసభ సన్నాహక సదస్సు



బోధన్‌లో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ, వేదికపై సుజాత సూర్యవంశి

బోధన్: దివ్యాంగులు, చేయూత పెన్షనర్ల పింఛన్ పెంచకపోతే సీఎం రేవంత్ రెడ్డి తన పదవీకి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. శనివారం బోధన్‌లోని అయేషా గార్డెన్‌లో డివిజన్ స్థాయి దివ్యాంగులు, చేయూత పెన్షనర్లతో వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభ సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన నెలలోపే దివ్యాంగులకు రూ. 6 వేలు,వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళలు, వివిధ కులవృత్తి కార్మికులకు రూ.4 వేలకు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చిందని, 20 నెలలు గడిచినా ఆ ఊసేత్తడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీలో ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాం హౌజ్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ఈ రెండు పక్షాల వైఖరి మోసపూరితంగానే ఉందని పేర్కొన్నారు.దీంతో తాను పేదల పక్షాన పింఛన్ల పెంపుదల సాధన ఉద్యమానికి శ్రీకారం చుట్టానని పేర్కొన్నారు. రూ.200 నుంచి 2016, దివ్యాంగులకు రూ.4016 పెన్షన్ల పెంపుదల వెనుక ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ చొరవ తీసుకుని నిర్వహించిన పోరాటాల ద్వారానే సాధ్యమైందన్నారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభకు దివ్యాంగులు తరలి రావాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి పిలుపునిచ్చారు. మంద కృష్ణమాదిగను ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సలీం ఈసదస్సుకు అధ్యక్షత వహించారు. వీహెచ్‌పీఎస్ జిల్లా, డివిజన్ ప్రతినిధులు కృష్ణ వేణి, మల్లయ్య, గంగాధర్, నారాయణ, శివకాంత్ , సాయమ్మ, ప్రదీప్,శారద, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, నియోజక వర్గ ఇంచార్జీ లసింగారి భూమయ్య, గంధమాల చంద్రయ్య వందలాది మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై వినతి

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులు పడుతున్న ఇబ్బందులపై ఎన్డీఎస్ఎల్ మజ్దూర్ సభ ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణమాదిగను కలిసి వినతి పత్రం అందించారు. ప్రభుత్వ ,ప్రైవేట్ కంపెనీ భాగస్వామ్యంతో నడిచిన ఎన్డీఎస్ఎల్ మూతపడి పదేళ్లు గడిచినా కార్మికుల బకాయి వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. బకాయివేతనాలు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడిపై దాడికి యత్నం



కుద్వాన్‌పూర్ పాఠశాలలో విచారణ చేపడుతున్న ఎంఈవో అవదూత గంగాధర్

నందిపేట్(ఆర్మూర్): ఉపాధ్యాయుడిపై విద్యార్థుల తల్లిదండ్రులు దాడికి యత్నించారు. సదరు ఉపాధ్యాయుడు పరారైన ఘటన శనివారం నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో జరిగింది. ఈనెల 19న కుద్వాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రెండో తరగతి చదువుతున్న విద్యార్థుల కంట్లో, చెవులల్లో కారం పోసిన ఘటన చోటు చేసుకుంది. దీంతో ఆ ఉపాధ్యాయుడు మూడు రోజులు పాఠశాలకు రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చిన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హెచ్ఎం సమక్షంలో అతడ్ని నిలదీశారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆగ్రహానికి గురైన విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించారు. వారి నుంచి అతడు తప్పించుకొని పరారయ్యాడు. విద్యార్థులతో శాడిస్టులా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడికి ఉన్నతాధికారులు వత్తాసు పలుకుతున్నారని పాఠశాలలో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మండల విద్యాశాఖ అధికారి అవదూత గంగాధర్ కుద్వాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈఘటనపై విచారణ చేపట్టారు. రెండో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.

స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

బోధన్: రాబోయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలని ,ఇందుకు క్షేత్ర స్థాయిలో అన్ని విధాల ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో డివిజన్ స్థాయి ఎంపీడీవోలతో కలెక్టర్ మాట్లాడారు. పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఎంపీడీవోలు, జీపీ కార్యదర్శులు,ఎన్నికల మాస్టర్ ట్రైయినర్లు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

పల్లెలకు తరలుతున్న భారీ గణనాథులు





ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో తరలిస్తున్న భారీ గణనాథుడు, ఆర్మూర్ మీదుగా..



కోనసముందర్ పాఠశాలలో మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు

బాల్కొండ/ఆర్మూర్‌టౌన్ : వినాయక చవితి శోభ మూడు రోజుల మందే ప్రారంభమైంది. దూర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను కొనుగోలు చేసిన మండపాల నిర్వాహకులు తమ గ్రామాలకు వినాయకులను తీసుకెళ్తున్నారు. ఈనెల 27 నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవతున్నాయి. మండపాలనిర్వాహకులు ఆర్మూర్, కోరుట్ల, హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన భారీ వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. బాల్కొండ మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలకు జాతీయ రహదారి 44 గుండా ఎక్కువ మొత్తంలో గణనాథులను పెర్కిట్, ఆర్మూర్ నుంచి తరలించారు.

ఏక్ భారత్ శ్రేష్ట భారత్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఏక్ భారత్ శ్రేష్ట భారత్ అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణ హితం కోసం మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేయించారు. అనంతరం విద్యార్థులు తెలంగాణ, హర్యానా సంప్రదాయ దుస్తులతో అలరించారు. నృత్యాలు చేస్తూ సందడి చేశారు. హెచ్ఎం మధుపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పులి అడుగులని రైతుల ఆందోళన

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో పంట పొలాల్లో పులిఅడుగు ఆకారంతో అడుగులు కనిపించడంతో రైతులు పులి తిరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అడుగుల గుర్తులను అటవీశాఖ సెక్షన్ అధికారి గణేశ్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో పులి సంచారించే అవకాశం లేదన్నారు. పులి అడుగులు సుమారు 16 సెంటీమీటర్లు ఉంటాయన్నారు. ఇక్కడ కనిపిస్తున్న అడుగులు పులివి కావని తేల్చి చెప్పారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్‌సీ లేని వాహనాలను కొనుగోలు చేయొద్దు

మాక్లూర్: ఆర్‌సీ లేని వాహనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం రాత్రి మండల పరిధిలోని మహాలక్ష్మి కాలనీలో మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవలకాలంలో దొంగతనం చేసిన వాహనాలను తక్కువ ధరకే విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి రిజిస్ట్రేషన్లు లేని 8 ఆటోలు, 50 ద్విచక్రవాహనాలను జప్తు చేశారు. గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. నార్త్‌జోన్ సీఐ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ రఘుపతి, పీఎస్‌ల ఎస్సైలు, ఆర్టీసీ కాలనీ అధ్యక్షుడు సురేష్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐఎంఎల్ ప్రజాంథా ఆర్మూర్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి దేవారం అన్నారు. ఆర్మూర్ సీవీఆర్ కళాశాలలో పీడీఎస్‌యూ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట యాత్రను శనివారం దేవారం జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేలకోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యక్షుడు అనిల్, జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్, ఏరియా అధ్యక్షుడు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంలో నిర్వహించే అర్బన్, రూరల్ క్రీడోత్సవాలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఎంఈవో రాజ గంగారాం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్ఎంలు, పీఈటీలకు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ సెప్టెంబరు 10,11,12 తేదీల్లో పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అర్బన్ క్రీడలు, సెప్టెంబరు 15,16,17 తేదీల్లో చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూరల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే అర్బన్ క్రీడల కన్వీనర్‌గా లక్ష్మీనర్సయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మల్లేష్ గౌడ్, రూరల్ క్రీడల కన్వీనర్‌గా చేతన కుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గంగాధర్‌లో వ్యవహరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో హెచ్ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో గేదె మృతి

మాక్లూర్: మండలంలోని రాంచంద్రాపల్లి శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం కరెంట్‌షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. గుత్ప గ్రామానికి చెందిన అశోక్ గేదెను మేత కోసం రాంచంద్రపల్లి శివారుకు తీసుకెళ్లాడు. దీంతో ఓ ట్రాన్స్‌పార్మర్ వద్ద రూ. 1, 50,000 విలువ చేసే గేదె కరెంట్ షాక్‌తో మృతి చెందిందని బాధితుడు వాపోయాడు.

సైబర్ నేరాలపై అవగాహన

బోధన్/బాల్కొండ : సాలూర పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ లో శనివారం పోలీస్ శాఖ షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బోధన్ రూరల్ షీటీం రూరల్ ఏఎస్ఐ ఆశన్న మాట్లాడారు. పాఠశాల దశ నుంచి ఉన్నత లక్ష్యాలతో చదవాలని ఎంఈవో రాజిమం జూష సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని మెండోరా ఎస్సై జాదవ్ సుహాసిని అన్నారు. మెండోరా మండలం పోచంపాడ్ జాతీయ రహదారి 44 కూడలీ వద్ద ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరల పెంపుపై చర్యలు తీసుకోవాలి

నవీపేట : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు అధిక ధరకు పురుగుల మందులను విక్రయిస్తున్నారని చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దేవెందర్ సింగ్ డీటీ రంజిత్‌కు వినతి పత్రం సమర్పించారు. యూరియా కొరతను ఆసరాగా చేసుకుని ఇతర మందులు కొంటెనే యూరియా విక్రయిస్తామని కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పోశెట్టి, నాయకులు తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే ట్రస్ట్ లక్ష్యం

రుద్రూర్: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కోనేరు చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని ఎన్నారై కోనేరు శశాంక్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ మాట్లాడుతూ... బాన్సువాడ నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నామని వెల్లడించారు. మెడికవర్ హాస్పిటల్ వైద్యులు, బీజేపీ మండల అధ్యక్షులు ఏముల నవీన్, నాయకులు హరికృష్ణ, ప్రకాష్ పటేల్, సున్నం సాయిలు, పుల్లెల మోహన్ రావు, శ్యామల కులకర్ణి, నాగెల్లి శ్రీనివాస్, వడ్ల శ్యామ్, వల్లభాపూర్ గంగాధర్,రాంపూర్ సాయిలు,లింగాపూర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



డొంకేశ్వర్‌లో ఎడ్ల బొమ్మలతో ఆలయానికి వెళ్తున్న వీడీసీ సభ్యులు



గోవూరులో హనుమాన్ ఆలయం చుట్టూ బసవన్నలను తిప్పుతున్న రైతులు

డొంకేశ్వర్/వర్ని : డొంకేశ్వర్ మండలకేంద్రం, నికాల్‌పూర్, మోస్రా మండలం గోవూరు గ్రామాల్లో శనివారం ఎడ్ల పొలాల అమావాస్యను రైతులు ఘనంగా జరుపుకొన్నారు. వీడీసీ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో ఎడ్ల బొమ్మలను తలపై మోసుకొచ్చి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రైతులు అలంకరించిన ట్రాక్టర్లను గ్రామాల వీధుల్లో తిప్పారు. అలాగే ఇంటి వద్ద ఉన్న బసవన్నలకు నైవేద్యాలు సమర్పించారు. గోవూర్‌లో రంగురంగుల డిజైన్లతో కూడిన వస్త్రాలను బసవన్నలపై కప్పారు. హనుమాన్ ఆలయం చుట్టూ బసవన్నల చేత ప్రదక్షిణలు చేయించారు.

ఉపాధ్యాయుల నిరసన



జిరాయత్ నగర్ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



కోటగిరిలో తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌టౌన్/డొంకేశ్వర్/కమ్మర్‌పల్లి/రుద్రూర్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం పలు చోట్ల నిరసన తెలిపారు. ఆర్మూర్‌లోని జిరాయతన్ నగర్‌లో ఎంపీపీఎస్ పాఠశాలలో, డొంకేశ్వర్ మండలకేంద్రంలో, పిప్రి, కమ్మర్‌పల్లి జెడ్పీ పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన చేపట్టారు.అనంతరం ఉపాధ్యాయులు ఆర్మూర్ సబ్‌కలెక్టర్,తహసీల్దార్ కార్యాలయాల్లో, డొంకేశ్వర్, రుద్రూర్, కోటగిరి తహసీల్దార్లు నరేశ్, తారాబాయి, గంగాధర్‌లకు వినతి ప్రతం అందించారు. ఉపాధ్యాయులు ఆర్మూర్ ఎంఈవో కార్యాలయం ముందు సీపీఎస్ జీవో కాపీలను దహనం చేశారు. ఈకార్యక్రమంలో టీపీఎస్‌యూ యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బోర్గాంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రెంజల్/బోధన్: ఈనెల 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభ వాల్‌పోస్టర్లను శనివారం మండలంలోని బోర్గాం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్‌లు మాట్లాడుతు కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్ర కారం ప్రతి సీజన్‌లో రైతులకు రూ. 500 బోనస్ చెల్లించాలని, రైతులకు అవసరమైన యూరియా అందించాలని, రాయితీ పై ఎరువులు, పురుగు మందులను అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎడపల్లి మండల కేంద్రంలో ఈమహాసభలకు సంబంధించి వాల్ పోస్టర్లను అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ము ల గంగాధర్ ఆవిష్కరించారు.డివిజన్ ప్రతినిధులు పుట్టినడ్పి నాగన్న, రాజేశ్వర్, మల్లేష్ , రవి, సుల్తాన్ సాయిలు, రెంజల్ మండల కార్యదర్శి నసీర్, ఒడ్డెన్న, పెద్దులు, గంగాధర్, గోపాల్, పోశెట్టి, జబ్బార్, లక్ష్మణ్, సాయిలు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి



బీజేపీలో చేరిన వారితో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్

బాల్కొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలో పలువురు బీజేపీ పార్టీలో ఆయన సమక్షంలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, నాయకులు ముస్కు భూమేశ్వర్, ముస్కు నర్సయ్య, గోపినాథ్, శ్రీనివాస్, నాయకుడు పద్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు పంపిణీ చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం

రుద్రూర్: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బాన్సువాడ సెగ్మెంట్ నాయకుడు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ ఆధ్వర్యంలోతహసీల్దార్ తారాబాయికి వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా గ్రామ సభ ఏర్పాటు చేసి ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాలన్నారు. వర్షకాలంలో బొప్పాపూర్ వాగు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, గజేందర్, ప్రశాంత్ గౌడ్, వి. రామ్‌రాజ్, శివప్రసాద్, పార్వతి మురళి, కృష్ణం రాజు, సున్నం సాయిలు, ప్రకాష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు సన్మానం

నవీపేట: పదోన్నతి పొందిన బీజేపీ నాయకులకు పార్టీ మండల అధ్యక్షులు ద్యాగసరిన్ ఆధ్వర్యంలో పోతంగల్ శివారులోని ఎంఆర్ఎల్ గార్డెన్‌లో సన్మానించారు. జిల్లా కమిటి కార్యదర్శిగా ఎన్నికైన మైస రాధ, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన రాంచందర్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి శ్రీధర్, ఐటీ సెల్ ఇన్‌ఛార్జి పిల్లి శ్రీకాంత్‌లను సన్మానించారు. నాయకులు రాజేందర్‌గౌడ్, భూషణ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణ స్థలం అప్పగింత

బాల్కొండ: ముప్కాల్‌కు మంజూరైన పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం మండల కేంద్రంలో సర్వే నంబరు 336లో గల 11 గుంటల భూమిని ఎంపిక చేశారు. ఈభూమిని శనివారం తహసీల్దార్ మజీబొద్దీన్ వైద్యాధికారి డాక్టర్ రాకేశ్‌కు అప్పగించారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



బాల్కొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ ముప్కాల్ మండల అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థులు తమ వివరాలను అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్‌లో చేరిన పలువురికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.